క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయముంటుందని ఏడీఈ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగంపల్లి పెద్దపల్లి సబ్ స్టేషన్ టౌన్–1 11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో పెద్దపల్లి, రంగంపల్లి, రామచంద్ర మిషన్, భూమ్‌నగర్, టీచర్స్‌కాలనీ, కూనారం రోడ్డు, వ్యవసాయ మార్కెట్‌తో పాటు తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 వరకు ఉండదన్నారు.

ఎంపీవోపై ఫిర్యాదు

ముత్తారం: ఎంపీవో వేణుమాధవ్ పలు అవకతవకలకు పాల్పడుతున్నాడని సోమవారం జిల్లా కలెక్టర్, డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు స్థానికుడు బోల్లంపల్లి సంతోష్‌గౌడ్ తెలిపారు.

అన్నదానం

సుల్తానాబాద్: పట్టణంలోని వికలాంగుల పునరావాసంలో సోమవారం తాళ్లపల్లి శివసాయి భరద్వాజ్ జన్మదినం సందర్భంగా వికలాంగులకు అన్నదానం చేశాడు. భిక్షాటన చేసేవారికి అన్నదానం పొట్లాలను అందించారు. తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, తుమ్మ రాజ్‌కుమార్, రఫీక్, రమేశ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలోని మోడల్ స్కూల్, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘునాథ్ తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లకు గాను దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా గాని.. నేరుగా కళాశాలలో గాని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రథమ వర్ధంతికి హాజరైన శివారెడ్డి


బాల్య మిత్రులతో శివారెడ్డి

రామగుండం: పట్టణానికి చెందిన బాణాల శ్రీధర్ మాతృమూర్తి భూలక్ష్మి ప్రథమ వర్ధంతికి సోమవారం సినీ, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి హాజరయ్యాడు. శివారెడ్డి బాల్య మిత్రులు కొలిపాక మహిపాల్‌రెడ్డి, దాసి రాకేశ్, ఈసంపల్లి రమేశ్, ఆరుముళ్ల కనకపాల్, నాయిని సునీల్, సోగాల కిషోర్‌కుమార్, కోడిపుంజుల భూమేశ్, బుర్ర రాజయ్య తదితరులున్నారు.

జీలకుంటలో కళాజాత ప్రదర్శన



ఓదెల: జీలకుంట గ్రామంలో సోమవారం కళాజాత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు కళాకారులు బుర్ర శంకర్‌గౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, మల్లేశంగౌడ్, రాజన్న ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ, పరిసరాల పరిశుభ్రత, బేటీ పడావో బేటీ బచావో ప్రదర్శనలిచ్చారు.

ఆటో డ్రైవర్‌కు చేయూత

కాల్వశ్రీరాంపూర్: పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కుంట దీపక్ అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. సోమవారం ఆటో యూనియన్ తరఫున రూ.8,000 ఆర్థిక సాయమందించారు. ఆపద సమయంలో ఆదుకోవడం గొప్ప విషయమని తాజా మాజీ సర్పంచ్ ఓకెగౌడ్, మాజీ సర్పంచ్ తాటికొండ సారయ్య, ఎంపీటీసీ కౌసల్య అన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ చాంద్, సభ్యులు మేకల కుమార్, అల్లెంకి అశోక్, బల్ల రమేశ్, అల్లెం శకర్, చల్లా చంద్రమౌళి, రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


రైతులు ఆందోళన చెందొద్దు


వడ్లను పరిశీలిస్తున్న లావణ్య

యైటింక్లయిన్‌కాలనీ: తడిసిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆందోళన చెందొద్దని జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రామగిరి లావణ్య అన్నారు. సోమవారం రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించి రైతులతో మాట్లాడారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని వడ్లను త్వరగా తూకం వేయాలని ఐకేపీ కేంద్రం నిర్వాహకులకు సూచించారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి తడిసిపోయిన వడ్లను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుడు నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. భయంభయం

- పనులు ఆగిన అండర్ బ్రిడ్జి పక్కనే రాకపోకలు
- జంకుతున్న ప్రయాణికులు
- మూడేళ్లుగా పూర్తి కాని వైనం


హరిపురంలో పనులు ఆగిన రైల్వే అండర్ బ్రిడ్జి

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో హరిపురం గ్రామ శివారులో పనులాగిన రైల్వే అండర్ బ్రిడ్జి పక్కనుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం హరిపురం గ్రామ శివారులో ఓదెల, సుల్తానాబాద్, జమ్మికుంట మండలాల ప్రజలు, ప్రయాణికులకు అనుకూలంగా అండర్ బ్రిడ్జి పనులను ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోపాటు ఇంజనీరింగ్ తప్పిదంతో బ్రిడ్జి అసంపూర్తిగా మారడంతో.. ప్రయాణికులు పక్కనుంచే దేవుడా కాపాడంటూ ప్రయాణం చేస్తున్నారు. బ్రిడ్జి పక్కనుంచి రహదారిపై అదుపు తప్పితే భారీ గుంతలో లేదా రైలు పట్టాల కింద పడాల్సిందే. హరిపురం గ్రామ శివారులో లెవల్ క్రాసింగ్ గేట్‌తో ఇబ్బందులను తొలగించేందుకు రైల్వే శాఖ అండర్ బ్రిడ్జిని మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మించటంతో సౌకర్యం నరకంగా మారింది. హరిపురం మీదుగా సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జమ్మికుంట మండలాల ప్రజలు, ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. ప్రస్తుతం అండర్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారటంతో.. ఇప్పటికి 20 మంది వాహనాలు అదుపుతప్పి గాయాలపాలయ్యారు. మరికొందరికి ప్రాణాలు పోయినంత పనైంది. ఎండల తీవ్రతతో బ్రిడ్జి మురుగు నీరు తగ్గినా.. తిరిగి నిర్మాణం కోసం కాంట్రాక్టర్ మాత్రం ఇప్పటివరకు అడ్రస్ లేరు. రాత్రి మాత్రం ప్రయాణం గ్యారంటీ లేదని హరిపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్ధాంతరంగా వదిలేసిన అండర్ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


హరిపురంలో లెవల్ క్రాసింగ్ గేట్

ఆదేశాలు రాలేదు

కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలోని హరిపురం లెవల్ క్రాసింగ్ గేట్ సమీపంలో అసంపూర్తిగా మిగిలిన అండర్ బ్రిడ్జి మరమ్మతుల కోసం ఆదేశాలు రాలేదు. రైల్వే శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, నిధుల మంజూరు తరువాతే పనులు జరుగుతాయి.
– అవినాశ్, జేఈఈ, రైల్వే శాఖ

ప్రయాణం నరకం



హరిపురం గ్రామ శివారులో బ్రిడ్జి పక్కనుంచి ప్రయాణం నరకంగా మారింది. అయితే బయటకు లేదా లోయలో పడి ప్రాణాలొదాల్సిందే. రైల్వే శాఖ అధికారులు అండర్ బ్రిడ్జిని సరిచేసి తిరిగి నిర్మించాలి.
– సాత్తూరి రవి, కాంగ్రెస్ నాయకుడు, కొలనూర్

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. మూడేళ్లుగా మండల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. వర్షాకాలంలో బ్రిడ్జి పనుల వద్ద సముద్రాన్ని తలపిస్తోంది. వెంటనే బ్రిడ్జిని నిర్మించాలి.
– గ్యారవేని నాగరాజు, మాజీ ఉప సర్పంచ్, హరిపురం

దేవుడిపైనే భారం



మండల కేంద్రం ఓదెలకు వెళ్లేందుకు హరిపురం గ్రామ శివారులోని బ్రిడ్జిపై ప్రయాణ భారం దేవుడిపైనే వేస్తున్నాం. బ్రిడ్జి ప్రారంభించి మూడేళ్లుగా వదిలేయటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.
– కాశవేని చేరాలు, ప్రయాణికుడు, గోపరపల్లె

క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్


సుల్తానాబాద్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: క్రీడలకు సుల్తానాబాద్ పుట్టినిల్లు అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో అశోక్‌నగర్‌కు చెందిన రంజిత్‌కుమార్ స్మారకార్థం డివిజన్‌స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి, సింగల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఫిక్, కుమార్ కిషోర్, గాజుల రాజమల్లు, చింతల రాజు, అబ్బయ్య, దున్నపోతుల శ్రీనివాస్, నాయకులున్నారు.

సామాజిక తనిఖీపై రిసోర్స్‌పర్సన్లతో సమీక్ష


సమావేశానికి హాజరైన ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు

రామగుండం: ఈనెల 21 నుంచి గ్రామాలవారీగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని ఎంపీడీవో ఎంఏ అలీం పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్, అంబుడ్స్‌మెన్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ చేపట్టిన పనుల వివరాలు, చెల్లించిన వేతనాలు, లబ్ధి పొందిన కూలీలు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరాలను ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు నమోదు చేసుకోనున్నారన్నారు. గ్రామస్థాయి అధికారులు వారికి సహకరించి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.
అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. పెద్దంపేట గ్రామంలో కొనసాగుతున్న పనులు, హాజరైన ఉపాధి కూలీలు తదితర విషయాలను సంబంధిత క్షేత్ర సహాయకుడినడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పని స్థలాల్లో అందుబాటులో ఉన్న రికార్డుల్లో నమోదు చేసిన వివరాలు, హాజరైన కూలీల వివరాలను పరిశీలించారు. ఎంపీడీవోకు గ్రామ క్షేత్ర సహాయకుడు పొనగంటి రాజయ్య పూర్తి వివరాలను వెల్లడించారు.
అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామాల్లో 2023–24వ ఆర్థిక సంవత్సరంలో కొనసాగిన ఉపాధిహామీ పనుల వివరాలపై క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా గ్రామాలవారీగా కూలీల సంఖ్య, చెల్లించిన వేతనాలు, వినియోగించిన మెటీరియల్ వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో రిసోర్స్‌పర్సన్ల బృందం ప్రతినిధులు మంగళవారం నుంచి పరిశీలించనున్నారు.

పూడిక తీయకుంటే ఆందోళన చేస్తాం


అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ రజిత

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్‌లో ప్రధాన నాలాలన్నీ పూడికతో నిండిపోయాయని, వెంటనే పూడికతీత తొలగించకుంటే డివిజన్ ప్రజలతో కలిసి బల్దియా కార్యాలయాన్ని ముట్టడిస్తామని డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ హెచ్చరించారు. సోమవారం డివిజన్‌లోని ప్రధాన నాలాల పరిస్థితిని డివిజన్ ప్రజలతో కలిసి పరిశీలించారు. వర్షాకాలం రాకముందే సిల్ట్ తొలగించే చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా కమిషనర్‌కు వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. ప్రధాన కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్త నిండి నీటి ప్రవాహం నిలిచి దుర్వాసన వస్తోందని, దోమలతో విష జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంధవేణ కుమార్, రావుల మల్లయ్య, మెరుగు లింగయ్య, క్రాంతి, కార్తీక్, పిట్టల సురేష్, మల్లయ్య, నెల్లి వంశీ, ఆకుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్‌కు రెడ్ సిగ్నల్..

చిత్ర కథ



సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు గాను సిగ్నల్ వ్యవస్థను ట్రాఫిక్, స్థానిక పోలీసులు ఏర్పాటు చేయగా.. ట్రాఫిక్ సిగ్నల్‌కే రెడ్ సిగ్నల్ పడింది. సంవత్సరం క్రితం పట్టణంలోని తెలంగాణ చౌరస్తా(అంబేద్కర్ చౌరస్తా) వద్ద ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేశారు. ట్రయల్ చేసి ఉన్నతాధికారులతో ప్రారంభించనుండగా.. ఇప్పటి వరకు ప్రారంభం కాకపోగా ఈదురు గాలులకు కింద పడింది. దీంతో పక్కన పడేశారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని టీ జంక్షన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ నాయకులు నగరపాలక కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌ను కలిసి చర్చించారు. రాజీవ్ ఫోర్‌లేన్‌లోని మున్సిపల్ టీ జంక్షన్ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోందని, బాటసారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు రోడ్డు పక్కన ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఉండగా, మరో రోడ్డు పక్కన ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీలతోపాటు సిమ్స్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో రోడ్డు దాటుతుంటారని తెలిపారు. జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్యతోపాటు నాయకులు కోదూరి రమేశ్, కోమళ్ల మహేశ్, కొండపర్తి సంజీవ్, సుల్వ పద్మ, పిడుగు కృష్ణ, మిట్టపల్లి సతీష్, గోపగోని నవీన్‌గౌడ్, కొమ్ము గట్టయ్య, బానాల స్వామి, మామిడాల శ్రీనివాస్, అపర్ణ, మచ్చ విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్‌గా సురేందర్


సురేందర్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్, సత్యనారాయణ

ధర్మారం: అలయన్స్ క్లబ్ 258 రీజనల్ చైర్మన్‌గా కొత్తూరు గ్రామానికి చెందిన తాళ్ళపెల్లి సురేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, సిరిపురం సత్యనారాయణ సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టి ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ సభ్యులు సురేందర్‌గౌడ్‌ను సన్మానించారు. ధర్మారం అలయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మామిడిశెట్టి శ్రీనివాస్‌ను నియమించారు. సురేందర్‌గౌడ్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమవంతుగా క్లబ్ ద్వారా నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. క్లబ్ సభ్యులు బైరి శివ, చంద్రమౌళి, కోలా అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, సోమారపు వెంకటేశ్వర్లు, కొంజర్ల మహేశ్, చెరిమల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ స్వాములకు భిక్ష



సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయకాలనీలో ఉన్న పెరిక గద్దె హనుమాన్ ఆలయంలో హనుమాన్ స్వాములకు పలువురు వ్యాపారులు భిక్ష నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా హోమం

ఎలిగేడు: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమద లమేల్మంగా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా హోమం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆరగింపు, బలిహరణం, శేష వాహన సేవ వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను జరిపారు. ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, భాగవతచరణరేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పాలకుర్తి: వేంనూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన తనుగుల రామయ్య, అతడి భార్య రాంబాయి ద్విచక్ర వాహనంపై కుక్కలగూడూర్ గ్రామం వైపు వెళ్తున్నారు. చొప్పదండి మండలం రాజంపేటకు చెందిన దీకొండ మహేందర్ కుక్కలగూడూర్‌లోని తన అత్తగారింటికి వచ్చి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. వేంనూర్ గ్రామ శివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో మహేందర్‌తోపాటు రామయ్య, అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం రామయ్యను కరీంనగర్‌కు, మహేందర్‌ను 108 ద్వారా పెద్దపల్లికి తరలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు


అడిషనల్ కలెక్టర్‌కు కొనుగోలు కేంద్రాల తీరును వివరిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అవకతవకలకు పాల్పడుతూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు కావేటి రాజ్‌గోపాల్, మేకల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి దాడి సంతోష్ ఆరోపించారు. పార్టీ నేతలతో కలిసి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు ఫిర్యాదు చేశారు. సన్న రకం ధాన్యాన్ని కొనడం లేదన్నారు. ధాన్యం నాణ్యంగా ఉన్న ఏ–గ్రేడ్‌కు బదులు బీ–గ్రేడ్‌గా నమోదు చేశారని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లతో నిర్వాహకులు కుమ్మక్కయి రైతులకు నష్టం చేస్తున్నారన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనాలని అన్నారు. నాయకులు రాజం మహంత, వేల్పుల రమేశ్, గాండ్ల రాజేశం, రాజేందర్, రాకేశ్, కరుణాకర్, గుడ్ల సతీష్ తదితరులున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీ లేబర్ క్యాంపులో బీహార్ రాష్ట్రానికి చెందిన చాంద్‌దేవ్ కార్వార్(35) క్యాంప్ సమీపంలోని ఎన్టీపీసీ గూడ్స్ రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని మృతిచెందాడు. చాంద్‌దేవ్ కార్వార్ ఆదివారం రాత్రి భోజనానంతరం పక్కనే ఉన్న రైల్వే ట్రాక్‌పై ఫోన్ మాట్లాడుతున్న క్రమంలో ఎన్టీపీసీ రైలు ఢీకొని మృతిచెందాడని సైట్ ఇన్స్పెక్టర్ మడిగురి సోమేశ్వరరావు ఫిర్యాదుతో ఎన్టీపీసీ ఏఎస్ఐ టి.తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. మృతుడికి భార్య భవితాదేవి, ఇద్దరు పిల్లలున్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


సుల్తానాబాద్‌రూరల్: మృతిచెందిన గేదెల వద్ద రైతు

సుల్తానాబాద్‌రూరల్: సుద్దాల గ్రామ శివారులో సోమవారం విద్యుత్ తీగలు తెగి పడగా.. పాడి రైతులు రాములు, సదయ్యకు చెందిన రెండు గేదెలు తీగలు తగిలి మృతిచెందాయి. పశువుల కాపరి రోజులాగే పశువులను మేపడానికి తోలుకుపోగా.. శివారులో ఆదివారం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అటుగా పశువులు వెళ్లడంతో తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించిన కాపరి మిగతా పశువులను అదుపు చేయడంతో మరో 20 గేదెలు ప్రమాదం నుంచి బయటపడ్డాయి. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారమివ్వడంతో కరెంట్ కట్ చేశారు. నష్ట పరిహారమివ్వాలని రైతులు కోరారు.
ముత్తారం: సీతంపేటకు చెందిన మోతె జక్కయ్య గేదె మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి సోమవారం అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఎలాంటి కంచెలు లేకపోవడంతో మేతకు వెళ్లి పశువులు బలవుతున్నాయని స్థానికులు తెలిపారు. గేదె విలువ సుమారు రూ.40వేలుంటుందని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోదావరిఖని: అక్రమంగా తరలుతున్న 120 బస్తాల రేషన్ బియ్యాన్ని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. బేగంపేట్ నుంచి రెండు వాహనాల్లో మహారాష్ట్రకు తరలిస్తుండగా.. పోలీసులకందిన విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక మిలీనియం క్వార్టర్ల వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. రెండు వాహనాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. బేగంపేట్‌కు చెందిన దాసరి సంతోష్, తిరుపతి, రాజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..

అటెన్షన్ ప్లీజ్



జ్యోతినగర్: నిత్యం ప్రజలు సంచరించే రోడ్డుపై మ్యాన్ హోల్‌కు మూత లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ రావూస్ స్కూల్ లైన్‌లో మ్యాన్ హోల్‌కున్న మూత కొద్ది రోజుల క్రితం పగిలిపోయింది. రాత్రి సమయంలో పాదచారులు, వాహనదారులు మ్యాన్ హోల్‌లో పడే అవకాశాలున్నాయి. స్థానికులు మున్సిపల్ అధికారులు, సంబంధిత విభాగానికి ఫిర్యాదు చేసినా.. మాకేందన్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మ్యాన్ హోల్‌లో ఎవరైనా పడి ప్రమాదానికి గురైతే బాధ్యులు ఎవరని, స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అండర్ బ్రిడ్జి వద్ద మరమ్మతులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ వసంత

పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్– దస్తగిరిపల్లి మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చేపట్టిన మరమ్మతులను ఎంపీటీసీ మిట్టపల్లి వసంత సోమవారం ప్రారంభించారు. పనులు పూర్తయితే పెద్దపల్లి నుంచి దస్తగిరిపల్లి, కొత్తపల్లి, మూలసాల, కొలనూర్ తదితర గ్రామాల ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తీరుతాయి. నాయకులు వెంకటేశంతోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899